# తోడు దొంగలు

★

* జి. వి. రామదాసు *

అది ఆ మెయిన్‌రోడ్డులో ఉన్న వెండికొట్లన్నిటికన్న పెద్దది. యజమాని రామానుజం అప్పుడే కొట్టుతెరచి బేరముకొరకు ఎదురుచూచు చున్నాడు.

9–30 గంటల వేళ:

"సుమారు 15 ఏండ్లు ఉంటాయి. చిరుగుల చీర కట్టుకొని చేతితో తంబురా పట్టుకొని పాడు కొంటూ ఆ కొట్టువద్దకు వచ్చినది.

"బాబూ! ధర్మకామందులు, ప్రభువులు ఒక కాని ధర్మం చెయ్యండి బాబు. మా తండ్రి జబ్బుతో బాధపడుచున్నాడు—మందుకొనడాన్కి ఒక కాని లేదు బాబయ్యా. మీకు పుణ్యముంటుంది ఏమైనా ధర్మం చెయ్యండి బాబూ" అని ఆ పిల్ల ధర్మం కోసం దీనంగా ప్రార్థించడం మొదలెట్టింది.

"చీ! చీ వెళ్ళిపో! ఇక్కడ మీ దొరకదు ఫో ఫో ఇప్పుడే కొట్టు తెరచేను ఫో ఫో ఏమి దొరకదు" అని రామానుజం కసిరేసాడు.

"బాబూ మీవంటివారు అలాగంటే మావంటి వాళ్లు ఏమౌతారు కరుణించాలి ప్రభూ! మీకు పుణ్యముంటుంది."

"నీకు చెప్పుతే కాదేమిటి మరియొక చోటికి పోయి అడుక్కో ఇక్కడేమి దొరకదు." అని రామానుజం కసరడం ప్రారంభించేడు.

"పోనిలెండి బాబయ్యా ఈ తంబురా ఉంచుకొండి బాబయ్యా! ఒక 5 రూపాయలు మాత్రం ఇప్పించండి."

"నేను తాకట్టువ్యాపారం చెయ్యలేదు పోపో" అన్నాడు రామానుజం.

"సాయంత్ర ఎలాగైనా అడుక్కొని మీ 5 రూపాయిలు ఇచ్చెస్తాను బాబయ్యా మా తండ్రిని రక్షించినవారౌతారు. ఇది మా తాతలదగ్గరనుండి మా యింటిలో నున్నది. ఇది మా తండ్రి ఎవ్వరికి ఇవ్వడు, .... నేను తీసుకొచ్చానని తెలుస్తే చంపేస్తాడు."

"సరే ఇంధ 5 రూపాయిలు తీసుకో, అది అక్కడ ఉంచు."

★

11-30 గంటల వేళ:

సుమారు 25 ఏండ్ల వయస్సుగల యువకుడు ఖరీదుగల సూటుధరించి ఒక సిల్కురుమాలు చేత్తో పట్టుకొని ఆ షాపులోకి ప్రవేశించాడు.

"ఏమండీ! మీ దగ్గర నెక్‌లేసులు ఉన్నాయండి?" అన్నాడాయన.

"దయచేయండి! కూర్చోండి ఆ కుర్చీమీద! మొన్ననే బొంబాయినుంచి వచ్చేయి రండి చూపించుతాను. ఒరే పెంటయ్యా! వినాయక కేఫ్‌కెళ్ళి కాఫితీసుకొనిరా," అన్నాడురామానుజం.

"ఏలాగు వీటి ఖరీదు? ఏవి upto-date fashionలో లేవు, ఇంతకన్న మంచివి ఉన్నాయా?"

"ఇంతకన్నా మంచివి మరి లేవు బాబు, వీటి ఖరీదు 150, 120 రూ యీలాగున్నవి."

"పోనీలేండి మంచి వెండికప్పులు సాసర్లు తీయించండి." అని ఆ యువకుడు కనులు మిరుమిట్లుపోయినట్లున్న ఆ షాపులోని వెండి సామాన్లంతా చూచేడు. అతనిదృష్టి అమాంతంగా అక్కడనున్న తంబురామీద పడింది. సంగీతంలో మంచి పాండిత్య మున్నట్లు ఆ తంబురాను ఇటు అటు చూచి "ఏమండి! మీకేమ

యిన సంగీతంలో పాండిత్యమున్నదా?" అన్నాడు రామానుజంతో ఆ యువకుడు.

"లేదుసార్: సంగీతం వినలేనటువంటివాడ్ని సంగీతంలో పాండిత్యమా అండి."

"అయితే ఈ తంబురా ఎవరిదండి చాల బాగున్నది. ఇది పాత తంజావూరి తంబురా. ఇటువంటిదానికోసం చాలరోజులై చాలప్రయత్నించుచున్నాను."

"ఇది మా స్నేహితుడిదండి. అతడు ఒక సినిమా కంపెనీలో ఆర్టిస్టు. ఏదో పనిమీద ఇది పట్టుకొనివెళ్తూ ఇప్పుడే ఇక్కడ ఉంచి వెళ్ళిపోయినాడు. మళ్ళి సాయంత్రం తీసుకొని పోతానన్నాడు."

ఇటువంటి తంబురాకోసం తిరుచునాపల్లిలో ఉన్న మా స్నేహితుడొకడికి వ్రాసేను. వాడు కొన్నాళ్లు పోయాక ఒకటి యున్నది. అదికూడా పాత తంజావూరి తంబురా 30 రూపాయిలు ఖరీదుట, నన్నురమ్మని వ్రాసేడు. తీరా అక్కడకు వెళ్లేక, అది నాకు నచ్చలేదు. ఇప్పటివరకు నాకు ఇటువంటి తంబురా దొరకలేదు. ఇటువంటి దానికోసం ఎంత డబ్బయినా ఖర్చుపెట్టుటకు సిద్ధముగా నున్నాను."

"మా స్నేహితుడుకూడా దీన్ని చాల జాగ్రత్తగా ఉంచుతున్నాడు. ప్రాణంపోయినా ఎవ్వరికి ఇవ్వడు...."

"ఇదిగాని అతడు అమ్ముతాడేమో కనుక్కొండి."

"అమ్మితే అమ్మవచ్చును. ఏమంటే. అతని దగ్గర ఇంకా ఇటువంటివి ఉన్నాయి" అన్నాడు తడుముకోకుండా రామానుజం.

"అమ్మే మాటుంటే నేను తీసుకొంటానండి."

"ఇటువంటి విప్పుడు దొరకడంలేదు కదండి అందుచేత అతడు 100 లేక 150 రూపాయిలో చెప్తాడు."

"సరే: డబ్బుకేమిలేండి ఆఖరికి 200 రూపాయిలయినా కొనడాన్కి సిద్ధముగా నున్నాను."

"అయితే సాయంత్రం అతడు వస్తాడు కనుక్కొంటాను మీరు రేపు పొద్దున్నరండి మరైతే సామానంతా తియ్యమన్నారు చూస్తారా?"

"ఇప్పుడు టైము అయిపోయింది. భోజనం వేళ అయింది." వెళ్తాను రేపు వస్తానుకదా. అప్పుడు కొంటాలెండి."

★

5-30 గంటలవేళ:

"బాబు: ఇదుగో 5 రూపాయిలు. నాతంబురా ఇచ్చేండి బాబూ: మీ మేలెప్పుడు మరవను బాబు."

"ఏం పిల్లా: ఈ తంబురా అమ్ముతావేటి మరో 5 రూపాయిలిస్తాను" అన్నాడు రామానుజం.

"అమ్మను బాబో: అమ్మడమే: మా నాన్న చీల్చేస్తాడు. అమ్మను బాబో, ఈ 5 రూపాయిలు తీసుకొని నాతంబురా ఇచ్చేండి బాబు."

"15 రూపాలిస్తాను ఆలోచించుకో."

"ఒద్దు బాబో: ఒద్దు! ఇచ్చింది బాబు నా తంబురా."

"25 రూపాయలిస్తాను ఎక్కడ దొరుకుతాయి తీసుకో ఇంద" అని 25 రూపాయిలు మొల్లోనుంచి తీసిచూపించాడు.

"అమ్మను బాబో: ఇచ్చేండి, మానాన్న ఒప్పుకోడు."

"చూడు పిల్లా! 50 రూపాలిస్తాను. ఎన్నాళ్ళు అడుక్కుంటే 50 రూపాయిలొస్తాయి. బాగా ఆలోచించుకో."

"సరే ఇవ్వండి" అని ఆ పిల్ల అనడంతోనే 50 రూ. ఇచ్చి సంతోషంతో లోపలికి పోయేడు రామానుజం.

★

వారం రోజులు అయిన తరువాత:

"ఏరా: పెంటయ్యా! ఆ తంబురా అడిగిన పెద్దమనిషిగాని అవుపడలేదురా." అన్నాడు రామానుజం నిట్టూర్పు విడుస్తూ.

"లేదు బాబు. ఆ తంబురా ఇచ్చిన పిల్లకూడా అగుపడలేదు బాబు."

"ఈవాళ వొస్తాడేమో."

"బాబు మరి ఆ పెద్దమనిషిగాని ఆ పిల్లగాని మరి కనబడతారనుకున్నారా బాబు. వాళ్లు ఇద్దరు తోడుదొంగలు బాబు" అన్నాడు, పెంటయ్య.

* ఆనందబాల